క్లుప్తంగా

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద బుధవారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, షార్ట్‌సర్క్యూట్ తదితర కారణాలతో ఏ విధంగా అగ్నిప్రమాదాలు సంభవిస్తాయో? వాటిని ఎలా నివారించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, సీతారాం, నాగరాజు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా మౌలిక వసతుల కల్పన

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: జగనన్న ఇళ్ల లే అవుట్‌ల వద్ద నిర్మాణాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ పీఓ, సాలూరు నియోజకవర్గ హౌసింగ్ ప్రత్యేకాధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని నెలిపర్తి వద్ద గల జగనన్న పట్టణ గృహ లేఅవుట్‌ను పరిశీలించారు. లే అవుట్ వద్ద అప్రోచ్‌రోడ్డు నిర్మాణం,నీటి సదుపాయం కోసం బోర్‌వెల్ పనులు తక్షణమే ప్రారంభించాలని, ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జయరాం, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



సాలూరు: పొట్టిశ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని సాలూరు పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో గల పొట్టిశ్రీరాములు విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీనాయకులు జర్జాపు సూరిబాబు, రాపాక మాధవరావు, గొర్లె వెంకటరమణ, శ్రీనివాసరావు, పిరిడి రామకృష్ణ, శ్రీనివాసరావు, బద్రి, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిప్పాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాస్పత్రి పరిపాలన అధికారిగా శ్రీధర్



పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రాస్పత్రి పరిపాలన అధికారిగా మీసాల శ్రీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఆసుపత్రిలో అన్ని విభాగాలపై పూర్తి అవగాహన కలిన శ్రీధర్, పదోన్నతిపై ఏఓగా నియమితులు కావడం సంతోషించదగిన విషయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి అన్నారు. ఆయన నియామకం పట్ల వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

పాఠశాల పరిశీలన



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ కృష్ణారావు

పాలకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థుకు మెరుగైన బోధన అందించాలని ఎంఈఓ పి.కృష్ణారావు అన్నారు. మండలంలోని తుమరాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణ, పరిశరాల పరిశుభ్రతపై ఆరాతీశారు. విద్యా ప్రమాణాలు తెలుసుకునేందుకు విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యార్థుల ప్రగతిని వారి తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు.

భూ వివాదాలు లేని గ్రామాలే లక్ష్యం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

భూ వివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని డోకిశీల పంచాయతీ రెవెన్యూ పరిధిలో గల చెలంవలసలో చేపట్టిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ పథకం 'మీ భూమి–మా హామీ' అనే బృహత్తర రీ సర్వే కార్యక్రమం 100 ఏళ్ల తరువాత రాష్ట్రంలో చేపట్టిన గొప్ప పని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివన్నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పార్టీ మండల సీనియర్ నాయకులు మజ్జి శేఖర్, బలగ నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఎస్.జగదీష్, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు, కార్యదర్శి పి.ఈశ్వర నారాయణ, ఆత్మ చైర్మన్ వై.తిరుపతి రావు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామ రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: రైతులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: జగనన్న ఆరోగ్య వైద్యశిబిరంలో హెచ్‌బీ, సుగర్ పరీక్షలు చెయ్యించుకుంటున్న డ్వామా పీడీ కె రామచంద్రరావు



సీతానగరం: రోగులకు మదుల కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఉచిత వైద్య సేవలు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా గ్రామాల్లో అనారోగ్యానికి గురైనవారందరికీ ఉచితవైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల వేలాది మంది వినియోగించుకున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తహసీల్దార్ ఎన్వీరమణ, సర్పంచ్ సీహెచ్ అప్పన్నమ్మల ఆధ్వర్యంలో సూరంపేటలో పీహెచ్‌సీ డాక్టర్ కె.శిరీష పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్యసురక్ష ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్య పరీక్షలతో పాటు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఐసీడీఎస్ పీఓ సుగుణ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించి వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు అన్నం ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఎంపీటీసీ బి వరలక్ష్మి, మాజీ సర్పంచ్ సాంబన్నదొర, పీఏసీఎస్ చైర్మన్ ఎం.త్రినాథ్, ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ, వైద్యులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేయించుకున్న డ్వామా పీడీ

సూరంపేటలో ప్రభుత్వం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరంలో మండల ప్రత్యేక అధికారి డ్వామా పీడీ కె రామచంద్రరావు సుగర్, హెచ్‌బీ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అరంతకం ఆయన మాట్లాడుతూ మండలంలో రక్తహీనతకు గురైన చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, వెల్ఫేర్ సహాయకుడు పాల్గొన్నారు.

యథాప్రకారం పింఛన్ పంపిణీ



బలిజిపేట: పెదపెంకిలో పింఛన్ అందిస్తున్న ఎంపీపీ నాగమణి



సాలూరు: ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ సంతోష్‌కుమార్

బలిజిపేట: జగనన్న ప్రభుత్వం పింఛన్ పథకం ద్వారా అర్హులకు ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి నిరుపేదలకు అండగా నిలుస్తోందని ఎంపీపీ నాగమణి తెలిపారు. మండలంలో 20సచివాలయాల పరిధిలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా పెదపెంకిలో ఎంపీపీ నాగమణి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

సాలూరు: మండలంలోని కురుకూటి సచివాలయానికి చెందిన వృద్ధాప్య పింఛన్ దారు సీహెచ్ కృష్ణమూర్తి అనారోగ్యంతో పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వలంటీర్ కె.సంతోష్‌కుమార్ ఏరియా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి పింఛన్ అందజేశాడు.

పండగ వాతావరణంలో పంపిణీ

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు బుధవారం పింఛన్ పంపిణీ చేశారు, పీఏసీఎస్ చైర్మన్ పర్యవేక్షలో సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,పీఏ సీఎస్ చైర్మన్ పర్యవేక్షణలో పింఛన్ అందజేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు చినభోగిలి గ్రామానికి చెందిన వ్యక్తికి గతంలో రూ 2,750లు పింఛన్ ఇచ్చేవారు. తాజాగా వలంటీర్ ఆధ్వర్యంలో రూ.10 వేలు సచివాలయ కన్వీనర్లు అందజేశారు,



సీతానగరం: వెంకటాపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్ బి.గౌరునాయుడు



చినభోగిలిలో దివ్యాంగుడికి రూ.10వేల పింఛన్ అందజేస్తున్న కన్వీనర్ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ ఎ.నివాస్

8,9తేదీల్లో రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ పర్యటన

- డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్



పార్వతీపురంటౌన్: అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకం ద్వారా పాఠశాలలకు కేటాయించిన నిధులు, పరికరాల పరిశీలనకు ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్సు కమిటీ ఈనెల 8,9 తేదీల్లో పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించనున్నట్లు డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అటల్ టింకరింగ్ పథకం ద్వారా నిధులు, విలువైన త్రీడీ ప్రింటర్, ఇంజినీరింగ్ పరికరాలు కేటాయించారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఎంతవరకు వినియోగంలోకి వస్తున్నాయి? విద్యార్థులను ఎలా తీర్చిదిద్దుతున్నారు? తదితర అంశాలు, రికార్డుల నిర్వహణ, ప్రయోగశాలల అమలు తీరును పరిశీలించడానికి సమగ్ర శిక్ష, ఎస్‌ఈఆర్‌టీ, కొంతమంది డీఎస్‌ఓలతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీని పాఠశాల విద్యాకమిషనర్ వేశారని, ఈ మేరకు వారు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అటల్ టింకరింగ్ ప్రయోగశాలలు 24ఉన్నాయని, స్టెమ్ ప్రయోగశాలలు 3, ప్రతి ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగశాలలు ఉన్నాయన్నారు. ఈ మేరకు ప్రయోగశాలలు, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా హెచ్‌ఎంలు, ల్యాబ్ ఇన్‌చార్జ్‌లు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా స్వామివారి కల్యాణం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం: పట్టణంలోని రాయగడ రహదారి పరిధిలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోపీనాథాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం ఆంజనేయునికి తమలపాకులు, సిందూరంతో పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ వేంకటేశ్వర స్వామి సహిత పద్మావతి అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. ప్రతి బుధవారం ఆలయంలో కల్యాణాన్ని ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజి ప్రోత్సాహంతో నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పకడ్బందీగా సోషల్ ఆడిట్

సీతంపేట: స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, సర్పంచ్‌లతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బి.ఆదినారాయణ మాట్లాడుతూ.. త్వరలో 15వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించనున్నందున రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. పకడ్బందీగా సోషల్ ఆడిట్ నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులు పారదర్శకంగా జరిగాయా లేదా అనేది పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, ఉపాధిహామీ ఏపీఓలు బాబురావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈఏఎస్ ప్రాక్టీస్ పరీక్షతో మేలు

బలిజిపేట: ఈ నెల 3వ తేదీన మండలంలోని 19పాఠశాలల్లో నిర్వహించనున్న ఎస్‌ఈఏఎస్ పరీక్షకు సంబంధించి ఆయా పాఠశాల్లో బుధవారం ప్రాక్టీస్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సామల సింహాచలం, ఎంపీడీఓ విజయలక్ష్మి పాఠశాలలకు వెళ్లి ప్రాక్టీస్ పరీక్షలను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడరతూ విద్యార్థులకు ఈ విధంగా పరీక్షలు నిర్వహించడం వల్ల తర్ఫీదు బాగా జరుగుతుందని ఎంఈఓ సామల సింహాచలం తెలిపారు. అసలైన పరీక్షలలో తడబాటు లేకుండా బాగా పరీక్షలు రాసే అవకాశాలున్నాయని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించిందీ? లేనిదీ? ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. 3వ తేదీన 19పాఠశాలల్లో మూడు, ఆరు, తొమ్మిదవ తరగతులకు చెందిన సుమారు 700మందికి పైగా విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నారాయణపురంలో విద్యార్థుల ప్రాక్టీస్ పేపర్లను పరిశీలిస్తున్న, ఎంఈఓ సామల, ఎంపీడీఓ విజయలక్ష్మి

భామినిని కరువు మండలంగా ప్రకటించాలి



ఎండిపోయిన పంటలను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

భామిని: మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో నీరులేక ఎండిపోతున్న పంటలను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో మండల కమిటీ బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ.. భామిని మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మండలంలో 9వేల ఎకరాల్లో వరి పంట, 5వేల ఎకరాల్లో ప్రత్తి పంట ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మండల కమిటీ అధ్యక్షుడు లక్ష్మీపతి నాయుడు, బిడ్డిక ప్రసాదరావు, లోపింటి అప్పారావు, సాసుపల్లి ఉధయబాబు, కొవ్వాడ మన్మథరావు, తదితరులున్నారు.

మార్గదర్శకాలను పాటించాలి

పార్వతీపురంటౌన్:

టీకా కార్యక్రమంలో నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని పుట్టూరు, పెదబొండపల్లి, చినబొండపల్లి గ్రామాల్లో వైద్యసిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఎంత మంది చిన్నారులు, గర్భిణులకు టీకా వేస్తున్నదీ, ఆర్‌సీహెచ్ రిజిస్టర్స్, టీకా అర్హుల జాబితాను పరిశీలించారు. టీకా కార్డులో గడువు తేదీలను తనిఖీ చేశారు. టీకా వేయడానికి ముందురోజు తెలియజేస్తున్నారా? అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఐదేళ్ల లోపు పిల్లల టీకా వివరాల సమాచారం పూర్తిస్థాయిలో యూవిన్, ఆర్‌సీహెచ్ పోర్టల్స్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నవజాత శిశువుల ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్‌ఎం నాగలక్ష్మి తదితరులున్నారు.



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

నిర్మాణం పూర్తయినా ఎంబుక్ నమోదులో జాప్యం?

సాలూరు: ఉపాధి హామీ ద్వారా గతంలో మంజూరైన పనులకు సంబంధించి ఇటీవల నూతనంగా నిర్మాణం చేపట్టినా అధికారులు ఎంబుక్‌లో నమోదు చేసేందుకు జాప్యం ఎందుకు చేస్తున్నారంటూ వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ప్రజాప్రతినిధులు జర్జాపు మోహన్ తదితరులు సంబంధిత ఉపాధిహామీ అధికారులను నిలదీశారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గరుగుబిల్లి రాములమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను చదివారు. ఈ క్రమంలో ఉపాధిహామీ ద్వారా మంజూరైన పనులు చేపట్టినా, ఎంబుక్‌లో మాత్రం నెలలు దాటుతున్నా నమోదు చేయడం లేదని, అధికారుల జాప్యం వల్ల బిల్లులు మరింత ఆలస్యమవుతున్నాయని ప్రజాప్రతినిధులు వాపోయారు. గతంలో మంజూరైన పనుల నిర్మాణం వద్దంటే చేపట్టబోమని ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

కరాడవలసకు జీసీసీ డిపో ఇవ్వాలి

ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో గిరిశిఖర గ్రామాలకు తారు రోడ్డు వేశామని, కరాడవలస ప్రజాప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం గ్రామానికి రహదారి సదుపాయం ఉన్న నేపథ్యంలో జీసీసీ డిపోను గ్రామానికి ఇవ్వాలని, సుదూర దండిగాం వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవడానికి సమస్యగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కరాడవలస, కరాసవలస, పెదబోరబంద గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండలంలోని 12 అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరుకాగా, నిర్మాణం జరుగుతోందని ఐసీడీఎస్ రూరల్ పీఓ సత్యవతి తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతమ్మ, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశం

కోకో మొక్కలు సరఫరా చేయాలి



మక్కువ: సర్వసభ్యసమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏవో శ్రీనివాసరావు

మక్కువ: అధిక దిగుబడినిచ్చే కోకో మొక్కలను రైతులకు సరఫరా చేసేందుకు ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలస్థాయి అధికారులు ఆయాశాఖలకు సంబంధించిన ప్రగతిని వివరించారు.

ముందుగా ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంటకు సుడిదోమ సోకిందని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆయిల్‌పామ్ మొక్కలను రైతులు నాటి, ఐదేళ్లు గడుస్తున్నా, బిల్లుల చెల్లింపు జరపలేదని ప్రజాప్రతినిధులు అసహనం వెలిబుచ్చారు. ఆయిల్‌పామ్ మొక్కలను దళారులు సరఫరా చేస్తున్నట్లు ఆరోపించారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ద్వారా మక్కువ పీహెచ్‌సీ పరిధిలో సుమారు 4వేల మందికి వైద్యసేవలు అందించినట్లు ఆయన తెలిపారు. వచ్చేనెలలో పశు ఆరోగ్యసురక్ష కార్యక్రమం ప్రారంభంకానున్నట్లు పశువైద్యాధికారి పోలందొర తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్.సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తీరు మారకుంటే చర్యలు

పాచిపెంట: మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ బడ్నాన ప్రమీల ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడ్నాన ప్రమీల అధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. పలు శాఖలకు సంబంధించి అధికారులు ప్రగతినివేదికలు చదివి వినిపించారు. ముందుగా వ్యవసాయశాఖపై చర్చ జరగ్గా ఎంపీటీసీ దండి ఏడుకొండలు మాట్లాడుతూ పత్తికొనుగోలు కేంద్రాలు ఆర్‌బీకేల పరిధిలో ఏర్పాటు చేయాలని కోరారు. వైద్యారోగ్య శాఖ సమీక్షలో మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతూ గిరిశిఖర ప్రాంతాల నుంచి ఆరోగ్య కేంద్రాలకు వచ్చి మూడు నుంచి నాలుగురోజుల పాటు చికిత్స పొందుతున్న రోగులకు, వారితో మరో వ్యక్తికి ఉచితంగా భోజన సౌకర్యం కల్పించేలా ఎంపీపీ తీర్మానం చేయాగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పీఆర్ విభాగంపై చర్చలో పలువురు గిరిజన సంర్పంచ్‌లు మాట్లాడుతూ బిల్లుల చెల్లింపులో ఏఈ డీఈలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పర్సంటేజ్‌లు ముందుగా ఇస్తే గాని ఎంబుక్ నమోదు చేయడం లేదని నందేడు వలసలో రూ.9.50 లక్షలతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్డుకు సంబంధించి ముందస్తు పీసీలు ఇవ్వలేదని పనిచేపట్టి మూడునెలలు అయినప్పటికీ ఎంబుక్ రికార్డ్ చేయలేదని ఆరోపించారు.

అవినీతి అధికారుల మూలంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ అధికారులపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. అలాగే పీఏయూ శాఖ అధికారులు ప్రతి సమావేశానికి గైర్హాజరవుతున్నారని, వెంటనే వారికి నోటీసులు ఇచ్చి రెండు జుల్లో సమాధానం చెప్పాలని, లేకుంటే వారిపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తానని స్పష్టం చేశారు.



పాచిపెంట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బడ్నానప్రమీల

సమస్యలు ఎవరికి చెప్పాలి?

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఇలాంటి సమావేశాలు నిర్వహించినప్పుడు అధికారులు గైర్హాజరవుతుంటే ప్రజాపతినిధులు వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని సర్పంచ్‌లు ఎంపీటీసీలు అవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కొరజన్ని సింహాచలం, వైస్ ఎంపీపీలు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారి పాల్గొన్నారు.